# కొత్తచుట్టం

రామకోటి జీవితం సగంపైగా అయిపోయింది.

జీవిత మధ్యాహ్నం సమయం దాటి సాయంకాలంలోకి అడుగు పెట్టబోతున్నందుకు అతనికి విచారం లేదు.

ఆట పాటలతో బాల్యం అందమైన ఉదయంలా గడిచిపోయింది. మంచి మార్కులతో పరీక్షల్లో నెగ్గుకువచ్చాడు, మంచి ఉద్యోగం వచ్చింది. అందమైన అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. ముత్యంలాంటి కొడుకు పుట్టాడు. కొడుకు కూడా బాగా చదువుకుని బాంక్‌లో ఆఫీసరు ఉద్యోగం సంపాదించాడు. ముప్ఫై ఏళ్ళు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి రిటైరయ్యాడు. పెన్షన్ కూడా ఏ చిక్కుల్లేకుండా సెటిలయ్యింది.

కొడుకు శ్రీవాత్సవకి పెళ్ళి చేశాడు రెండు నెలల క్రిందటే.

ఉదయం ఆరు గంటలకే మెలకువ వచ్చింది రామకోటికి. మంచంమీద నుంచి లేవబుద్ధి కాలేదు. మరో అరగంట దుప్పటి మొహం మీద కప్పుకుని పడుకున్నాడు.

వంట గదిలో కమలమ్మ చేసే చప్పుళ్ళు అతనికి వినిపిస్తూనే ఉన్నాయి. శ్రీవాత్సవ కూడా నిద్ర లేచినట్లున్నాడు. ఏడింటికి గాని వాడు రోజూ నిద్రలేవడు. అలాంటిది ఉదయాన్నే లేచి ఇంటి పనులు చేస్తున్నాడంటే విచిత్రంగానే ఉంది. పక్క గదిలో బీరువా, టేబుల్ పక్కకు జరుపుతున్న శబ్దాలు రామకోటికి వినిపించాయి. భార్య, కొడుకు ఏదో హడావుడిలో ఉన్నట్లు గ్రహించాడు.

మంచంమీద నుండి లేవకుండానే దిండు గోడవారన వేసుకుని, దానికి ఆనుకుని కూర్చున్నాడు.

గది నిండా ఉషోదయం వెలుగు ఆవరించుకుంది. కిటికీలో నుంచి చల్లటి గాలులు దూసుకువచ్చి రామకోటిని ముట్టడి చేశాయి.

కిటికీలో నుంచి దూరంగా కనిపించే కొండలు, చేలు చూస్తూ మంచంమీద అలాగే కూర్చుండిపోయాడు.

గంటల తరబడి మంచంమీద కూర్చుని కిటికీలో నుంచి కనిపించే ప్రకృతి దృశ్యం చూస్తూ గడవడం అతనికి ఇష్టం. ఇంటి వెనుక అంతా ఖాళీ స్థలాలే. ఇళ్ళు లేవు. ఇంటి ముందు గదిలో కూర్చుంటే రోడ్డుమీద వచ్చి పోయే కార్లు, సైకిళ్ళు, రిక్షాలు, జనం కనిపిస్తారు. ఆ ముందు గదిలో ఓ క్షణం కూడా కాలు నిలువదు రామకోటికి. వెనుక గది అంటేనే ఇష్టం. చిన్నప్పుడు తల్లిదండ్రులు ముందు గదిలో పడుకోమని చెప్పినా వినేవాడు కాదు. వెనుక గదిలో తల్లిదండ్రుల మధ్య ఇరికేవాడు. నిద్రపోయాక ముందు గదిలో పడుకోబెట్టినా, ఓ రాత్రివేళ మెలకువ రాగానే లేచి వెళ్ళి తల్లిదండ్రుల వద్ద పడుకునేవాడు.

ముందు గదిలో రోడ్డు మీద నుంచి వచ్చే దుమ్ము ధూళి, వాహనాల శబ్దాలు అతనికి వచ్చేవి కావు. ఆ గది అంటేనే ఓ విధమైన అయిష్టత ఏర్పడింది.

భార్య రాకకోసం ఎదురుచూశాడు కొంతసేపు. రోజూ ఆరింటికల్లా పేపరు తీసుకువచ్చి, తనను నిద్రలేపి, ఓ పది నిముషాలు కబుర్లు చెప్పి వెళ్ళేది. వచ్చే సూచనలు కూడా కనిపించలేదు.

రేడియో వాల్యూమ్ పెంచేశాడు శ్రీవాత్సవ. పైగా ఆ మోతకు తోడు వాడు పెద్దగా వంతపాడటం. వాళ్ళిద్దరి ప్రవర్తన గమనిస్తూ ఉంటే ఇంట్లో తనున్నాననే సంగతే మరిచిపోయారల్లే ఉంది.

విసుగొచ్చి పడకగదిలో నుంచి బయటకు వచ్చేశాడు రామకోటి. కమలమ్మ పలుకరించలేదు. గ్రైండర్‌లో పప్పు వేసే ప్రయత్నంలో ఉందామె. ఆమె నుదుటిమీద, చెక్కిళ్ళ మీద చెమట బిందువులు చూసి ఉలిక్కిపడ్డాడు. చలికాలంలో కూడా చెమట బిందువుల ఉదయాన్నే మొహంమీద కనిపించాయంటే ఎంత శ్రమ పడిందో ! నాలుగు గంటలకే మంచంమీద నుంచి లేచిపోయి స్నానం చేసి, పనిలో మునిగిపోయింది.

భార్యను చూసి జాలిపడ్డాడు.

"కాఫీ కలుపుతాను. వెళ్ళి మొహం కడుక్కునిరండి." ఓ క్షణం భర్తకేసి చూసి, మళ్ళీ తన పనిలో మునిగిపోయింది కమలమ్మ.

బాత్‌రూమ్‌లోకి దూరాడు రామకోటి.

"మీ నాన్నది గొప్ప జాతకంరా అబ్బాయి... మీ తాతయ్యగారు మీ నాన్నని కాలు కింత పెట్టనివ్వకుండా పెంచారు... ఇప్పుడు అన్నీ మనమే చూసుకోవాల్సి వస్తుంది... ఏ

విషయం పట్టించుకోరు... సొంతంగా ఒక్క పని చేసుకోలేరు... నీడపట్టు మనిషి... ఎవరి నీడ, అండా లేకుండా అడుగు తీసి అడుగు కూడా ముందుకు వెయ్యలేరురా !" అంది కొడుకుతో కమలమ్మ.

శ్రీవాత్సవ పెద్దగా నవ్వాడు.

ఆమె మాటలు. బాత్‌రూమ్‌లో మొహం కడుక్కుంటున్న రామకోటికి వినిపించాయి. అతనికి కోపం రాలేదు.

పెళ్ళయిన దగ్గరనుంచీ ఇంటి పనులన్నీ ఆమే చూస్తోంది. తను జీతం తెచ్చి ఆమె చేతుల్లో ఉంచడమే. తనకు కావల్సిన బట్టలు కూడా ఆమె కోనాల్సిందే ! ఆమె పడుతున్న శ్రమను గుర్తిస్తే చాలు ఆమెకు కొండంత తృప్తి. మెచ్చుకోలుగా ఒక్క మాటంటే చాలు ఆమెకు ఏనుగు ఏక్కినంత సంబరం.

టవల్‌తో మొహం తుడుచుకుంటూ హాల్లోకి వచ్చాడు. పొగలు కక్కె వేడి వేడి కాఫీ తెచ్చి ఇచ్చింది.

పరీక్షగా ఆమెవైపు చూశాడు.

వయస్సు తెచ్చిన మార్పు కొట్టొచ్చినట్లు కనిపించింది ఆమెలో. అక్కడక్కడ తెల్లబడ్డ వెంట్రుకలు, ముక్కుమీద, చెక్కిళ్ళ మీద నల్లమచ్చలు, లావెక్కిన జబ్బలు, పిరుదులు...

ముప్ఫై ఏళ్ళ క్రితం తను ఆరాధించిన సౌందర్యరాశి ఈమేనా? ఆ సొగసులన్నీ ఏమయ్యాయి?

"ఈ పూట అటూ ఇటూ తిరగకండి" అంది కమలమ్మ.

"ఏమిటి విశేషం?"

"అయ్యో రామ... అప్పుడే మర్చిపోయారూ! కోడలు పిల్ల ఈ రోజే కదా మ నింటికి వచ్చేది."

ముఖ్యమైన విషయమే మర్చిపోయేడు తను... కొడుకు మొహంలో తొంగిచూస్తున్న కొత్త కళని పసిగట్టలేకపోయాడు... కమల హడావుడి అర్థం చేసుకోలేకపోయాడు.

"అబ్బాయి వాళ్ళ మామగారు పంపించిన డబుల్ కాట్ మంచాలు మనం పడుకునే వెనుక గదిలో వేయిస్తున్నాను. మన పాత మంచాలు రోడ్డు వైపున ముందు గదిలో వేస్తున్నాను" అంది కమలమ్మ.

రోడ్డు వైపున్న ముందు గది అసలు నచ్చదు రామకోటికి. వెలుగుల గది వెనుక గది వదిలిపెట్టాలని వినగానే తల్లడిల్లిపోయాడతను.

"రోడ్డు మీద వెళ్ళే వాహనాల మోతతో రాత్రిళ్ళు. నాకు నిద్ర పట్టదే ! బాబు వాళ్ళ మంచాలే ముందు గదిలో వేయించు" అన్నాడు కంగారుగా.

"మనకు నిద్రపట్టినా, పట్టకపోయినా నష్టం లేదు గాని, అబ్బాయి వాళ్ళ డబుల్ కాట్ మంచాలు వెనుక గదిలోనే వేస్తున్నా" అనేసి, కాఫీ కప్పు తీసుకుని వంట గదిలోకి వెళ్ళిపోయింది కమలమ్మ.

తనకు ఏది ఇష్టమో, ఏది అయిష్టమో అమెకు తెలుసు. తనకు ఏ కష్టం రాకుండా, తన మనస్సుకు నొప్పి కలుగకుండా ప్రవర్తించడం ఆమెకు తెలుసు. కానీ ఈ విషయంలో తను చెప్పినట్లు వినకుండా మొండికేసిందంటే తన మాటకు విలువ లేదన్నమాటే!

రామకోటి మనస్సు చివుక్కుమంది.

శ్రీ వాత్సవ అప్పుడే తన బట్టల సూట్‌కేస్ తీసుకువెళ్ళి వెనుక గదిలో పెట్టుకున్నాడు. గోడలకు వాడి కిష్టమైన ఆయిల్ పెయింటింగ్స్ తగిలిస్తున్నాడు. ఆ గది అప్పుడే వాడి సొంతమైనట్లు ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతూ ఉన్నాడు.

మంచంమీద నుంచి లేచి గదిలో నుంచి ఎందుకు బయటకు వచ్చానా అని మథనపడ్డాడు రామకోటి. 'గంటలు, రోజులు, యుగాలు ఆ గదిలోపలే ఉండిపోతే ఎంత బాగుండేది?' అనుకున్నాడు మనసులో.

పదకొండు గంటలు దాటాక సుస్మిత వచ్చింది. కొత్త కోడల్ని ఆదరంగా ఆహ్వానించింది కమలమ్మ.

సుస్మితతో పాటే ఆ అమ్మాయి అక్కయ్య వచ్చింది. వాళ్ళ వెంట వచ్చిన మగవాళ్ళు ఓ గంట మాట్లాడి తిరిగి వెళ్ళిపోయారు.

సుస్మిత వచ్చేక శ్రీవాత్సవ రెప్పవాల్చడం మర్చిపోయాడు. అతని చూపులన్నీ సుస్మిత మీదే. అతని వాలకం చూసి సుస్మిత అక్కయ్య నవ్వుకుంది.

కమలమ్మకు ఒక్క క్షణం తీరిక దొరకట్లేదు. ఇంటికి వచ్చిన వాళ్ళకు మర్యాదలు చెయ్యడంతోనే తలమునకలైపోయి ఉంది.

రామకోటికి మాత్రం తన ఇంట్లో కూర్చున్నట్లుగా లేదు. పరాయి ఇంట్లో, ముళ్ళమీద కూర్చున్నట్లుంది.

భార్య, కొడుకు తన ఉనికినే గమనించనట్లుగా ప్రవర్తించడంతో మొహం చిన్నబుచ్చుకున్నాడు.

భోజనానికి పిలిచేంతవరకూ ఇంటి ముందున్న పుస్తకాల షాపు దగ్గరే కాలక్షేపం చేశాడు.

మధ్యాహ్నం రెండు గంటలప్పుడు ఇంట్లో నుంచి బయటపడ్డాడు, రామకోటి.

"ఎండలో ఎక్కడకు బయల్దేరారు?" అని భార్య అడుగుతుందనుకున్నాడు.

ఇంట్లో చెప్పులేసుకుని తచ్చాట్లాడినా ఎవ్వరూ పట్టించుకోలేదు ఆయన్ని.

ఓ గంటసేపు ధ్యేయం లేకుండా నడిచి, చివరకు బస్‌స్టాండ్ దగ్గర షెల్టర్ క్రింద నిలబడ్డాడు.

పక్కన నిలబడ్డతని దగ్గర పేపరు అడిగాడు. "సినిమా పత్రిక సార్!" అన్నాడా కుర్రాడు సినిమా పత్రిక ఇస్తూ.

"సినిమా పత్రికయితే మాత్రం నేను చదవకూడదా?" అందా మనుకున్నాడు. కోపం మనసులోనే దిగమింగుకుని పేజీలు తిరగేశాడు.

అర్ధనగ్న చిత్రాలకేసి రామకోటి చేస్తుంటే, ఆ కుర్రాడు ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ సిమెంటు బెంచీమీద కూర్చున్న వాళ్ళకి ఏదో చెబుతున్నాడు.

రామకోటికి వళ్ళు మండి పేపరు తిరిగి ఇచ్చేశాడు.

☆ ☆ ☆

"ఎక్కడదాకా ప్రయాణం?"

ఉలిక్కిపడి చూశాడు.

ఎదురుగా ఓ సంవత్సరం వయసున్న కుర్రవాడిని ఎత్తుకుని సుగుణ కనిపించింది.

సుగుణ, రామకోటి కలిసి ఒకే కాలేజీలో చదివారు. సుగుణ బాగా పాటలు పాడేది. ఆటల్లో ఫస్ట్ వచ్చేది. అప్పుడప్పుడు నాటకాలు కూడా వేస్తూ ఉండేది. రామకోటిని పెళ్ళి

చేసుకోవాలని ఎన్నో కలలు కన్నది. ఎంతో ప్రయత్నించింది. మగవాళ్ళతో భుజం, భుజం రాసుకుంటూ తిరగటం, నాటకాలు వెయ్యడం అతనికి నచ్చలేదు. ఆమెను పెళ్ళి చేసుకునే ప్రసక్తేలేదని కుండ బద్దలుకొట్టినట్లు చెప్పేశాడు. చదువు అయ్యాక ఉద్యోగం రావడం, తల్లిదండ్రులు కుదిర్చిన అమ్మాయి కమల తనక్కూడా బాగా నచ్చడంతో పెళ్ళి చేసుకున్నాడు.

ఏభై ఏళ్ళ వయసు వచ్చినా సుగుణలో ఇంకా ఆకర్షణ తగ్గలేదనుకున్నాడు మనసులో రామకోటి.

"ఏమిటి మాట్లాడరూ ! ఇప్పుడు మిమ్మల్ని పెళ్ళి చేసుకోమని బలవంత పెట్టనులెండి" అంది సుగుణ నవ్వుతూ.

"గుంటూరు దాకా వెళ్ళాల్సిన పనిబడింది" అన్నాడు మెల్లగా. ఇంటికి దూరంగా, ఏదో ఒకచోటుకి వెళ్ళాలనిపించిందతనికి ఆ క్షణంలో.

"హమ్మయ్య ! బ్రతికించారు. ఈ బండెడు సామానుతో, తెగ అల్లరిచేసే మనవడితో ఎలా ప్రయాణం చెయ్యాలో అర్థంగాక బుర్రగోక్కుంటున్నాను. మీరు తోడు దొరికారు. మా అమ్మాయి, అల్లుడు గుంటూరులోనే కాలేజీలో లెక్చరర్స్‌గా పని చేస్తున్నారు. మావారు యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేసి రెండేళ్ళ క్రితం రిటైరయ్యారు. మద్రాసులోనే సెటిలయ్యాం. ఈ ఊరు సొంత ఊరు అయినా పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. మా పిన్ని కూతురు పెళ్ళయితే వారం రోజుల క్రితం ఇక్కడకు వచ్చాం. అమ్మాయి, అల్లుడూ వెళ్ళిపోయారు. ఇదిగో నేను తీరిగ్గా ఇప్పుడు బయల్దేరాను మనవడితో."

గలగలా మాట్లాడేస్తున్న సుగుణ మాటల ధోరణి చూస్తుంటే ఇప్పటికీ చదువుకునే రోజుల్లో ఉండే ఉత్సాహం తగ్గలే దనిపించింది.

"మీ సంగతులు ఏమిటి?"

"ఏముంది రిటైర్డ్ లైఫ్... గోళ్ళు గిల్లుకుంటూ కాలక్షేపం చేయడం" నవ్వే ప్రయత్నం చేస్తూ అన్నాడు రామకోటి.

గుంటూరు బస్సు వచ్చి ఆగింది.

ఇంటికి, ఇల్లాలికి దూరంగా కొన్నాళ్ళు గడపాలనిపించింది.

ఆమె సామాను తనే బస్సులో సర్దాడు.

పక్క సీట్లో కూర్చోమని ఆమె బలవంతం చెయ్యడంతో కూర్చోక తప్పలేదు. రామకోటికి.

బస్సులో తెలిసిన వాళ్ళెవరన్నా ఉన్నారేమోనని పరకాయించి చూశాడు. అదృష్టవశాత్తు ఎవరూ లేరు.

బస్సు కదిలాక మెత్తగా ఆమె భుజాలు రాసుకుంటుంటే మనసు దూదిపంజలా గాలిలో తేలిపోతున్నట్లనిపించింది.

పొన్నూరులో బస్సు ఆగినప్పుడు సుగుణ మనవడికి బిస్కెట్ల పాకెట్ కొనిపెట్టాడు. ఆమెకు మల్లెపూల దండ కొని తెచ్చాడు.

మల్లెపూలదండను తల్లో తరుముకుంది ఎటువంటి సంకోచం లేకుండా.

గుంటూరు చేరుకునేవరకు ఆమె తన భర్త మంచితనం గురించి చెబుతూనే ఉంది.

సుగుణ భర్త సంస్కారానికి ముగ్దుడయ్యాడు. అల్లరిగా తిరిగే సుగుణలో ఇంత మార్పు తేచ్చాడంటే, నిజంగా ఆయన గొప్పవాడే ననిపించింది రామకోటికి.

గుంటూరులో బస్సు దిగాక కూతురు, అల్లుడిని కూడా చూసి వెళ్ళమని రామకోటిని బలవంతపెట్టింది. తనకు వేరే అర్జెంటు పనులున్నాయని గట్టిగా రామకోటి చెప్పడంతో రిక్షామాట్లాడుకుని వెళ్ళిపోయిందామె.

ఇంటిమీద గాలి మళ్ళింది కాని ఆ రాత్రికి తిరగి వెళ్లదల్చుకోలేదు రామకోటి. లాడ్జిలో రూము తీసుకున్నాడు.

నిద్ర పట్టలేదు.

పక్కమీద అశాంతిగా అటూ, ఇటూ పొర్లాడు. స్కూటరుమీద ఊరంతా తనకోసం గాలించే కొడుకూ, ప్రతి క్షణం తన రాకకోసం గేటువైపు చూస్తూ ఎదురుపడే భార్యా గుర్తుకు వచ్చారు.

☆ ☆ ☆

మరుసటి రోజు ఉదయం తిరుగుప్రయాణమయ్యాడు రామకోటి.

ఇంటికి చేరుకునేసరికి పన్నెండయ్యింది.

తండ్రి తిరిగొచ్చిన సంతోషం కొడుకు కళ్ళలోద్యోతకమయ్యింది. భర్తను చూసి

పలుకరించుకుండానే కూనిరాగం తీస్తూ తన పని చేసుకుపోతూనే ఉంది కమలమ్మ. మామగారిని చూడగానే అత్తగారు కూనిరాగాలు తీయడం కోడలు గమనించింది.

ఇంట్లో కోడలు ఒక్కతే రామకోటికి ఎదురొచ్చి పలుకరించింది.

"ఒక్క రోజు మీరు ఇంట్లో చెప్పకుండా వెళ్ళేసరికి అత్తయ్యగారు, మీ అబ్బాయి కంగారు పడిపోయారు. అత్తయ్యగారు పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టుకోలేదు. వేడినీళ్ళు తోడుతాను... స్నానం చేయండి" అంది సుస్మిత టవల్ అందిస్తూ.

తన గురించి ఆలోచించే మరో ప్రాణి ఆ ఇంట్లో చేరినందుకు రామకోటి మనసు ఆనందపడింది.

మనవడిని ఎత్తుకుని గర్వంగా ఊరూరు తిరిగే సుగుణ గుర్తుకు వచ్చింది. 'అలాంటి ముద్దుల మనవడు తనకూ ఉంటే బాగుండును! అనుకున్నాడు మనసులో.

"మీకు గుర్తు ఉందా? మనకు పెళ్ళయిన కొత్తలో మీ నాన్న వెనుక గదిని పడుకోవడానికి మనకు ఇవ్వలేదని మీరు వారం రోజులు అన్నం తినకుండా అలిగారు" అంది నవ్వుతూ.

సిగ్గుపడ్డాడు రామకోటి.

ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకుని ప్రేమగా నిమిరాడు. అతని మనసు తేలికపడింది.

ఇప్పుడు రోడ్డువైపు ముందు గదిలోనే కాదు, రోడ్డుమీద పడుకోమన్నా ఏమనుకోడు రామకోటి. ✻

**(ఆంధ్రప్రభ వారపత్రిక - 15-2-1989)**